# దేవుడు గారు

నాకు అయిదుగురు పిల్లలు - ఇప్పటికి.

ఇప్పటికి అని ఎందుకన్నానంట, ఓ నెల రోజుల క్రితమే మళ్ళీ మా ఆవిడకి నెల తప్పింది.

నేను చదువుకునే రోజుల్లో చాలా సార్లు పరీక్షలు తప్పాను. అచ్చం హేమమాలినిలా వుండే పిల్లని పాతిక వేల కట్నంతో సహా యిచ్చి చేస్తానన్న మా మేనమామ - నేను పరీక్ష తప్పానని తను మాట తప్పి, కూతుర్ని మరోడికిచ్చి చేశాడు. జీతం పెంచుతానని, మూడేళ్ల నుంచీ మా మేనేజర్ మాట తప్పుతూనే వున్నాడు.

నాకు తియ్యటి కబుర్లు చెప్పి, రోజూ తన పనిలో సగం నా చేత చేయించుకుని, నాతో వొంటరిగా సినిమా కొస్తానని వాగ్దానం చేసిన నాకో - టైపిస్ట్ - అచ్చం డింపుల్ కపాడియాలా వుంటుంది - ఆర్నెల్ల నుంచీ మాట తప్పుతోంది - దొంగ ముండ!

ప్రజలందరికీ తియ్యటి కబుర్లు చెప్పి, దేశంలో సోషలిజం తెస్తామన్న దొరతనంవారు చాలా కాలం నించీ మాట తప్పుతూనే వున్నారు.

నా జీవితంలో మొదట్నుంచీ ఇన్ని తప్పడాలు జరుగుతూనే వున్నా నేను పెద్దగా పట్టించుకోలేదు. అంతగా బాధపళ్ళేదు. కాని, మా ఆవిడ ఈ రకంగా మాటిమాటికీ, ఏటి ఏటికి నెల తప్పడం మాత్రం మహా ఇబ్బందిగా వుంది.

అందుకని నాకు అర్జంటుగా ఒక వంద రూపాయలు అవసరమొచ్చాయి. (ఇక్కడ కాస్త అన్వయం తప్పే ప్రమాదముంది,అందు కని 'అంటే, 'ఓ నెల రోజులక్రితం మా ఆవిడకి మళ్ళీ

నెల తప్పిన కారణంగా ' అని)

పుట్టబోయే ఆరో పిల్లవాడు - లేక పిల్ల - సక్రమంగానూ ఆరోగ్యంగానూ పుట్టాలంటే ఇప్పట్నించే తప్పని సరిగా, మందులు- కాస్త ఖరీదైన మందులు వాడితీరాల్సిందే, లేకపోతే, బిడ్డకీ తల్లికీకూడా ప్రమాదం జరిగే అవకాశముంది అని, మా ఆవిణ్ణి పరీక్ష చేసిన లేడీ డాక్టర్ మా ఆవిడతో నవ్వుతూనూ నాతో సీరియస్‌గానూ చెప్పింది

మా ఆవిడకి నెల తప్పి, వైద్య పరీక్ష కోసం తీసుకెళ్లినప్పుడల్లా, ఆ డాక్టరెందుకో నా వంక కొరకొరా చూసి, అతి సీరియస్‌గా మాట్లాడుంది మళ్ళీ ఫీజు బాగానే యిస్తుంటాను

ఇప్పుడావిడ ఫీజుగ్గాని, మందుగ్గాని వంద రూపాయలు కావాలి నా దగ్గర పైసాలేదు అప్పుడే నెల మూడో వారం నడుస్తోంది అప్పుచేస్తే గాని అవసరం తీరదు నాకు అడగ్గానే అప్పిచ్చే అపద్బాంధవుడొకడున్నాడు వాడు నాకు చిన్నప్పట్నించీ స్నేహితుడు నాతోపాటే చదివాడు నాతోపాటే పరీక్షలు తప్పాడు

నాతోపాటే ఒక చిన్న వుద్యోగంలోచేరి కొన్నాళ్ళకది మానేసి ఒక చిన్న వ్యాపారం పెట్టి అందులో బాగా లాభాలు గడించి , ఇప్పుడు చాలా పెద్ద వాడయిపోయాడు నేనేమో అచచ్చు వుద్యోగాన్నీ. మానే జర్నీ. కో టైపిస్టునీ, దొర తనం వారినీ అందర్నీ నమ్ముకుని ఎందుకూ పనికి రాకుండా పోయాను

వాడి పేరు సూరిబాబు అలవాటు ప్రకారం అప్పుకోసం వాడి దగ్గరకే వెళ్ళాను అదృష్ట వశాత్తూ నే వెళ్ళినప్పుడు యింట్లోనే వున్నాడు

అప్పులు చెయ్యటం అలవాటే అయినా, విషయం ఎలా ప్రారంభించాలో నాకు తెలీలేదు ఇంతలో వాడి భార్య లోపల్నించి వచ్చింది కాస్సేపు ముసిముసి నవ్వులు నవ్వి, మరి కాస్సేపు సిగ్గుపడి "మా వదిన గారు మళ్ళీ నీళ్ళోసుకున్నారటగా అన్నయ్యగారూ' అంది మెల్లగా ఈ సారి నేను సిగ్గుపడ్డాను " అవునమ్మా --' అని నసిగాను

" అలాగటోయ్ మరి చెప్పలేదేం?"అన్నాడు సూరిబాబు అదేదో అతి ముఖ్యమైనట్టుగానూ ఆ విషయం ఇన్నాళ్లూ చెప్పక పోవటం నా తప్పయినట్టుగానూ నేను మరి కాస్త సిగ్గుపడ్డాను " ఆ విషయం చెబుదామనే వచ్చాను " అని మళ్ళీ నసిగాను

"నువ్వదృష్టవంతుడివిరా "అన్నాడు సూరిబాబు నా వంక అదోలా చూస్తూ పెళ్ళయిన ఏడేళ్ళలో ఆరోసారి మా ఆవిడ నెల తప్పటం నా అదృష్టమని అప్పుడే తెలిసింది నాకు తెలిసి కాస్త గర్వపడ్డాను సూరిబాబు కళ్ళలో కించిత్తు అసూయకూడ కనబడింది అది చూసి మరీ గర్వపడ్డాను అన్నట్టు చెప్పటం మర్చిపోయాను - నా పెళ్లీ సూరిబాబు పెళ్ళీ ఒకటే సంవత్సరం జరిగాయి కాని వాడికింకా పిల్లల్లేరు

సూరిబాబు భార్య టీ తెచ్చి యిచ్చింది. అది తాగి, మాఆవిడ మళ్ళీ నెల తప్పటానికిగల పూర్వాపరాలన్నీ చెప్పి, ఆ దంపతుల కుతూహలం తీర్చి, అప్పుడు మెల్లగా అప్పడిగాను.

"దానికేమిటోయ్... వందకాకపోతే రెండు వందలు తీసుకో... మందులవీ జాగ్రత్తగా యిప్పించు..." అన్నాడు సూరిబాబు; అన్నాడే గాని అడిగిన డబ్బు వెంటనే యివ్వలేదు ఇవ్వటానికో షరతు పెట్టాడు. " ఇప్పుడు నా దగ్గర డబ్బులేదు - ఒకడివ్వాలి; వాడు మరో రెండు గంటల్లో తెచ్చియిస్తాడు - ఈ లోగా మనం అలా వెళ్ళొద్దాం - 'భగవాన్' వూళ్ళోకొచ్చారు... దర్శనం చేసుకొద్దాం -" అన్నాడు. అవసరం నాది గనక వాడు చెప్పిందానికి చచ్చినట్లు వొప్పుకున్నాను.

ఇద్దరం కలిసి బయటికి నడిచాం. 'భగవాన్' దర్శనానికి బయల్దేరాం.

'భగవాన్ ' అంటే నిత్యహాయి బాబావారు. వారి గుణగణాల గురించీ వారి మహిమల గురించీ అద్భుత శక్తుల గురించీ సూరిబాబు దార్లో నాకు తెలీని విషయాలు చాలా చెప్పాడు.

నిత్య హాయి బాబావారు వారి అనుచరులకీ సహచరులకీ భక్త కోటికీ నిత్యమూ హాయి కలిగిస్తుంటారట. అందుకే వారికా పేరు వచ్చిందట. అసలు మొదట్లో వారి పేరు వుత్త హాయిబాబాయేనట. దరిమిలా వారి భక్తులంతా నిత్య అనేది కూడా చేర్చారట. ఇవన్నీ చెప్తూ చెప్తూ " విష్ణు మూర్తి అవతారాలెన్ని ?" అని ఓ చిన్న ప్రశ్న వేశాడు సూరిబాబు.

"పదికాబోలు -"అన్నాను అనుమానంగా. దేవుళ్ళ గురించి నా కాట్టే తెలీదు.

నా అజ్ఞానానికి సూరిబాబు చాలా చింతించాడు. చింతించి " కాదు పదకొండు పదకొండో అవతారమే నిత్యహాయి బాబా!" అన్నాడు. కలియుగంలో జరుగుతున్న అన్యాయాలన్నీ అరికట్టి, పాపాలన్నీ పరిహరించి, ప్రజలందరికీ మోక్షాన్ని ప్రసాదించేందుకే బాబావారు అవతరించారట.

నాకో చిన్న అనుమాన మొచ్చింది. " విష్ణు మూర్తి రామావతారంలో వుండగా సీతాదేవిగానూ కృష్ణావతారంలో వుండగా రుక్మిణీ దేవిగానూ లక్ష్మీదేవి పుట్టింది గదా,మరి ఇప్పుడు నిత్య హాయి బాబా అవతారంలో లక్ష్మీదేవి ఎవరు? అనడిగాను. ఈ ప్రశ్నకి ఎందుకోగాని సూరిబాబుకి కాస్త కోప మొచ్చింది . కాస్సేపటికి కోపం తమాయించుకుని " ఈ అవతారంలో లక్ష్మీదేవి ప్రత్యేకించి ఒక వ్యక్తిగా భూలోకంలో పుట్టలేదు. కాని భగవాన్ లీలా మానుష వేషధారులు కనక, కేవలం ఒక్క స్త్రీలో కాకుండా అనేక మందిలో లక్ష్మీదేవిని చూస్తూ వుంటారు. అదే వారిలో ప్రత్యేకత -- " అన్నాడు.

బాబా వారికున్న ఇంకా అనేక ప్రత్యేకతల గురించి సూరిబాబు ఆవేశంతో తన్మయత్వంలో దారి పొడుగునా చెప్తూనే వున్నాడు.

మేం వెళ్ళే సరికి మందిర ప్రాంగణం అంతా కిట కిట లాడిపోతోంది 'నిత్యహాయి నగర్' అనే పేరుతో ఈ నగరంలో బాబావారి భక్తులంతా కలిసి ఒక పెద్ద ఆశ్రమాన్ని నిర్మించి యిచ్చారు బాబా వారిక్కడికి విచ్చేసినప్పుడల్లా అక్కడే విడిది చేస్తుంటారట ఇక్కడే కాదు దేశంలో ంకా అనేక నగరాల్లోనూ, విదేశాల్లోనూ కూడా బాబావారి పేరిట ఇలాంటి ఆశ్రమాలూ భవనాలూ మందిరాలూ చాలా వున్నాయట ఈ దేశంలో ప్రజలందర్నీ వుద్ధరించాక అమెరికా వెళ్ళిపోయి, అక్కడే స్థిరపడిపోయి అక్కడి వాళ్ళ నందర్నీ ఉద్ధరిద్దామని బాబావారు అనుకుంటున్నారట ఈ విషయం చెప్పి - "ఇది దేవరహస్యం ,భగవాన్ సాన్ని ధ్యంలోవుండే ఒక వ్యక్తి ద్వారా నాకీ సంగతి తెలిసింది ఎవరితోనూ అనబోకు "అన్నాడు సూరిబాబు అందు వలన " భగవాన్ "అనుగ్రహాన్ని పొందాలంటే అట్టే వ్యవధి లేదు మనం తొందరపడాలి " అని హెచ్చరిక కూడా చేశారు

క్షణక్షణానికీ భక్తు ల సంఖ్య పెరిగిపోతోంది భగవాన్ దర్శనం కోసమై ఆత్రుత పెరిగి పోతోంది బాబా వారు ఆసీనులయ్యే వేదికకి అతిసమీపంలో వారి అంతరంగికులకీ అతి ముఖ్య భక్తులకీ, ఆ వెనక ముఖ్య భక్తులకీ ,కొంచెం వెనక ప్రధాన భక్తులకీ, అందరికంటే , వెనక సామాన్య భక్తులకీ కూర్చోటానికి ఏర్పాట్లు చేశారు సూరిబాబు ప్రధాన భక్తుల్లో ఒకడు వాడితో పాటు నాకూ ఆ వర్గంలో స్థానం దొరికింది

అంతరంగికుల్లోనూ అతిముఖ్య భక్తుల్లోనూ మంత్రులున్నారు న్యాయ మూర్తులున్నారు కోటీశ్వరులు కూడా ఉన్నారు బాబావారు వాళ్ళందరికీ విడిగాకూడా దర్శనమిస్తూవుంటారట వాళ్ళకే ముందుగా మోక్షం ప్రసాదిస్తారట " ఆ తర్వాతే మనబోటి వాళ్ళకి మోక్షం " అన్నాడు సూరిబాబు " ఎందుకని ? భక్తుల్లో డబ్బునిబట్టీ , హోదానిబట్టీ , అధికారాన్ని బట్టీ భేదాలేమిటి? "అని అడిగాను సూరిబాబుకి కోపమొచ్చింది ' నువ్వు మరీ యింత అజ్ఞాని వనుకోలేదు "అన్నాడు

మరో గంట గడిచాక ,భక్తుల కళ్ళన్నీ కాయలు కాచాక, బాబా వారు ప్రత్యక్షమయ్యారు వారు వస్తున్నారని తెలీగానే భక్తులంతా లేచి నిలబడ్డారు వారు అల్లంత దూరాన కనబడగానే వారు నడిచే దారిలో వున్నవారంతా సాష్టాంగ నమస్కారాలు చెయ్యటం ప్రారంభించారు బాబావారిని నేను చూట్టం అదే మొదటి సారి వార దేహచ్ఛాయ శ్యామలం వారి దుస్తులు కాషాయం. వారి మొహం ప్రసన్నం అన్నింటిలోకీ ముందుగానన్నాకర్షించింది వారి జుట్టు. వారి తలకంటె జుట్టు పెద్దది ఉంగరాలు తిరిగి అదేదో కొత్తరకం టోపీ పెట్టినట్టుగా వుంది విగ్గేమోనని నాకనుమానమొచ్చింది సూరిబాబు చెవిలో మెల్లగా ఆ మాటే అడిగాను అది నిజం జుట్టేనంటావా లేకపోతే విగ్గా'అని వాడికీ మళ్ళీ కోపమొచ్చింది ఈ సారి సమాధానం చెప్పలేదు ఎందుకో ఒక సారి చెంపలు మటుకు వేసుకున్నాడు

భక్తురాండ్రంతా విడిగా ఒక పక్క కూర్చున్నారు బాబావారు తమ వేదిక మీదికి వస్తూవస్తూ వారి వేపు మళ్ళి, వారి మధ్య నుంచి రావటం ప్రారంభించారు. ఆడవాళ్ళలో అలజడి, బాబావారి చూపు తమ మీదికి ప్రసరింపచేసుకోడానికీ, వారి పాదాలు స్పృశించి వారి దీవెనలందుకోటానికీ తొక్కిడి, తోపులాట బాబావారు గోపికా పరివేష్టితుడైన గోపాల కృష్ణుడిగా వెలిగిపోతున్నారు బాబావారు మగ భక్తులకంటే ఆడభక్తులకే ముందు ముక్తి ప్రసాదిస్తారా అని కూడా నాకో అనుమానమొచ్చింది సూరిబాబు నడుగుదా మనుకున్నాను గాని వాడి ధోరణిచూసి భయమే సింది వాడీలోకంలో లేడు

బాబావారు వేదిక మీదికి రాగానే " భగవాన్‌కీ జై"నిత్యహాయి బాబావారికీ జై" అన్న జయజయ ధ్వానాలు మిన్నుముట్టాయి పటాల్లో దేవుడి బొమ్మలాగా ఒక అభయముద్ర ప్రదర్శించి , ఆ తరువాత బాబావారు ఆసీనులయ్యారు ఆ తరువాత వారి అతి ముఖ్య భక్తులలో కొందరు ఆడామగా కలిసి బాబావారి మహిమల్ని కొనియాడుతూ ప్రార్థనాగీతం పాడారు

ప్రార్థనానంతరం బాబావారులేచి నిలబడి ఉపన్యాసం ప్రారంభించారు వారికీ ప్రపంచంలోవున్న భాషలన్నీ వచ్చుట సూరిబాబు చెప్పాడు అందుకే కాబోలు, వారు మాట్లాడుతున్నదేభాషో ఒక పట్టాన నాకర్థం కాలేదు " నాయనలారా, ఈ ప్రపంచంలో చాలా కష్టాలున్నాయి, భాధ లున్నాయి అందుకే నేను అవతరించాను "అన్నారు బాబావారు మళ్ళీ ఒకసారి " నిత్యహాయిబాబా వారికీజై"- అన్న నినాదాలు ప్రతి ధ్వనించాయి ' ఈ కష్టాలన్నీ మిధ్య అంతామాయ నిజమేమిటోకనుగొంటే ఏ బాధలూ లేవు " అన్నారు మళ్ళీ బాబావారు మళ్ళీ కాసేపటికి - " పరమాత్మ ఒక్కటే సత్యం! నిత్యం! నిత్య హాయిబాబా ఒక్కడే నిజమైన దేవుడు "అన్నారు "చివరికి - నేను లేను మీరు లేరు నేనే నువ్వు నువ్వే నేను నాలోనీవున్నావు నీలోనేనున్నాను " అన్నారు

నాకేమీ అర్థంకాలేదు సూరిబాబు నడుగుదామంటే వాడు అర్థనిమీలిత నేత్రాలతో ఆనంద పారవశ్యంలో వున్నాడు

బాబావారి తర్వాత వారిఅతిముఖ్య భక్తుల్లో ముగ్గురు నలుగురు మాట్లాడారు ఒకాయన - " మీకు నిత్యమూ హాయి కావాలంటే నిత్యమూ బాబానే కొలవండి " - అన్నాడు నాకేదో వ్యాపార ప్రకటన గుర్తొచ్చింది " దేశంలోవున్న దరిద్రాన్నంతటినీ బాబావారు తల్చుకుంటే క్షణంలో తొలగించగలరు కాని ఎవరి కర్మ వారనుభవించి తీరాలి బాబావారు తల్చుకుంటే చెయ్యలేని దేమీ లేదు - వారు సకల శక్తి సంపన్నులు - సర్వసమర్థులు కరుణా సముద్రులు - అందువల్ల వారిని కొలచి తరించండి - మీ జన్మలు సార్థకం చేసుకోండి "- అని ఆయన ఉపదేశించాడు

మిగతా భక్తుల ఉపన్యాసాలుకూడా ముగిశాక, ఆడభక్తులంతా కలిసి

"నిత్యహాయిబాబాకి నిత్యశుభ మంగళం - అంటూ మంగళ హారతులు పాడారు.

సభానంతరం బాబావారు తమ ఆంతరంగిక భక్తులందరికీ స్వహస్తంతో బూడిద పంచి పెట్టారు. బూడిద అన కూడదు. విభూతి అనాలని సూరిబాబునన్ను చివాట్లేశాడు. విభూతి అప్పటికప్పుడు సృష్టించి పంచి పెట్టారు బాబావారు. విభూతేకాదు, ఉంగరాలూ నెక్లేసులూ, హారాలూ, పతకాలవంటి ఇంకా అనేక రకాల వస్తువులుకూడా వారు సృష్టిస్తారట, పొట్టలోంచి, తమ పొట్టలోంచి శివలింగాలు బయ... ...స్తారట, సూరిబాబు కూడా అతి కష్టమ్మీద కాస్త బూడిద - విభూతి సంపాదించాడు. అందుకెంతో గర్వించాడు.

ఇంటికి తిరిగి వెళ్ళాక తను సంపాదించిన విభూతిలో నాక్కూడ కాస్త యిచ్చాడు. భగవాన్ అపూర్వ శక్తుల్ని గురించి మరోగంటసేపు అనర్గళంగా ఉపన్యసించి, ఆ తర్వాత నేనడిగిన అప్పిచ్చి పంపించాడు.

అప్పు దొరికినందుకేకాక, నిత్య హాయి బాబావారి దర్శనం కూడా దొరికినందుకు నేనూ అంతో యింతో ఆనందించాను.

* * *

ఇదంతా జరిగి అర్నెల్లయింది.

దొంగ నోట్ల చలామణీ విషయంలోనూ, దొంగ బంగారు అమ్మకం వ్యవహారంలోనూ ...బంధమున్నందువల్లా ఇంకా అ... ...ర మల్లర నేరాలపైనా 'నిత్య హాయిబాబా' వారిని పోలీసులు అరెస్టు చేసినట్టు నిన్నే పే...ల్లో పడింది.

నేను నమ్మలేక పోయాను. నిజమేవిటో తెలుసుకుందామని సూరిబాబు దగ్గర కెళ్లాను గాని, ఆ విషయం గురించి మాట్లాడ్డానికి వాడు నిరాకరించాడు. ●

*("హాస్య ప్రభ" ప్రారంభ సంచిక జూలై - 1975)*